క్లుప్తంగా

రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీ దుబ్బగూడెంలో శనివారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. దుబ్బగూడెం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు ఐటీడీఏ నిధులు రూ.1.05కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్ బాదు, వైస్ ఎంపీపీ విక్రంరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సత్తయ్య, ఉపసర్పంచ్ తిరుపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడపాలని వినతి

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి గోదావరి పుష్కరఘాట్ వరకు బస్సు నడపాలని కోరుతూ శనివారం ఆప్ ఆధ్వర్యంలో డీఎం రవీంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కాలేజ్‌రోడ్‌లో బీఎస్సీ నర్సింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ, సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలతో పాటు ప్రైవేట్ స్కూల్, సఖీ కేంద్రం, టీహబ్ సెంటర్, మాతాశిశు కేంద్రం ఉందన్నారు. బస్సు నడపటం వల్ల ప్రజలకు సౌకర్యార్థం ఉంటుందని డీఎం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆప్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నయిం, బాధ్యులు నాగేంద్రప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

దండేపల్లి: సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించాలని వైద్యురాలు అభిజ్ఞా సూచించారు. జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా దండేపల్లి, కొండాపూర్, చింతపల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి యువ ఉత్సవ్

మంచిర్యాలఅర్బన్: నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఈ నెల 3న కేంద్ర యువజన శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా జాతీయ సేవా పథకం కన్వీనర్ చంద్రమోహన్‌గౌడ్ అన్నారు. 15 నుంచి 29సంవత్సరాల వయస్సు కలిగిన కళాకారులు పాల్గొనవచ్చన్నారు. గ్రూప్ డ్యాన్స్, ఫోక్, క్లాసికల్‌లో 10మంది పాల్గొనవచ్చన్నారు. యంగ్ ఆర్టిస్ట్ పోటీ పెయింటింగ్, పద్యపోటీ, కల్చరల్ ఫెస్టివల్, మొబైల్ ఫొటోగ్రఫీ పోటీలుంటాయన్నారు. స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్లో ఉదయం 9గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

'బెల్ట్ షాపులపై ప్రశ్నిస్తే కేసులు పెడుతారా'



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని ప్రశ్నిస్తే.. కేసులు పెడుతారా అని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రామిల్ల రాధిక ఆరోపించారు. మద్యం బాటిళ్ల ధ్వంసం చేసిన కేసులో ఆమెను అరెస్ట్ చేయగా శనివారం బెయిల్‌పై వచ్చారు. కేసులను నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు సమర్పించి, నిరసన వ్యక్తం చేశారు. నాయకులు శ్రీధర్, చెన్నూర్, భీమారం, జైపూర్ మండలాల నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చెన్నూర్: భీమారం, జైపూర్, చెన్నూర్ మండలాల్లో ప్రైవేట్ పాఠశాలలను యజమానులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నా విద్యాధికారి పట్టించుకోవడం లేదని నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్, ఐక్య విద్యార్థి ఉద్యమ వేదిక నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, ప్రవీణ్, క్రాంతి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఎలాంటి సౌకర్యాలు లేకపోయినా, అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

- వైద్యులను సన్మానించిన పలు సేవా సంఘాల సభ్యులు
- కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్న పలువురు డాక్టర్లు



మంచిర్యాలటౌన్: వనితా వాక్కు ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో శనివారం అంతర్జాతీయ డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ గాజర్ల దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. సమాజంలో వైద్యులకు, సిబ్బందికి సముచిత స్థానం ఉందన్నారు. అనంతరం ఉత్తమ డాక్టర్‌గా ఎన్నికైన లలితకు జీఎం శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏరియా ఈఅండ్ఎం తిరుమలరావు, డీజీఎం(సివిల్) సతీష్‌బాబు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శౌరి, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరి అనుముల సత్యనారాయణ, సుదర్శన్, ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్: వైద్యుల దినోత్సవం సందర్భంగా చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు సత్యనారాయణతో పాటు మరో ఇరువురు వైద్యులను సాయిఅన్నపూర్ణ వృద్ధాశ్రమం నిర్వాహకులు పుల్లూరి సత్తయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రాణాలను కాపాడే వైద్యులను సన్మానించడం మా అదృష్టమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాస్, సభ్యులు నడిపల్లి లక్ష్మణ్‌రావు, మంచాల వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వైద్యులకు శ్రీ శివసాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామ్మూర్తి, వైద్యులు శేఖర్, సురేష్, పవిత్ర, అస్మత్, ఆఫ్రిన్, శృతి, వెంకటేష్, అజయ్, శ్రీనివాస్, పవన్, రాజ్‌కుమార్, సభ్యులు ప్రసన్న, సుమతమ్మ, వినోద్ ప్రభాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: డాక్టర్స్ డేను పురస్కరించుకుని వనితా వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్లైన చంద్రదత్, అన్నపూర్ణ, రమణ, నీరజ, స్వరూపారాణి, శరత్ కుమార్, మోహన్, రాంచందర్, రజిత, ప్రశాంతి, రాజశేఖర్, సంధ్యలను సన్మానించారు. కార్యక్రమంలో జ్యోత్స్న, కవిత, సునీత, సత్యవతి, శైలజ, తేజస్విని, అవంతి, రజని పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని రాముని చెరువు వాకర్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో చెరువు కట్టపై పలువురు వైద్యులను సన్మానించారు. డాక్టర్ రేడియాలజిస్టు అట్లూరి వెంకటేశ్వర్‌రావు, జనరల్ సర్జన్ డాక్టర్ ఎం.సల్మాన్‌రాజు, ఆర్థోసర్జన్ కె.త్రినాథరావు, అనేస్తీషియా వైద్యుడు కేవీఎల్ఎస్ మూర్తిని శాలువా కప్పి, బొకేలతో సన్మానించారు. మంచిర్యాల మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను డాక్టర్ నాగమల్లేశ్, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ వరుణ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, మైనారిటీ నాయకులు ఎండి సోహైల్‌ఖాన్, ఎస్‌కె తాజ్‌బాబా, అతిక్‌ఖాన్, జుబెర్, చిట్టి బాద్‌షా, అలిం, ముమిర్, శంశిర్, అజ్జు, రహీం, జావిద్, ఆసిఫ్ పాల్గొన్నారు.

'ఆర్ఎంపీలు.. పేదల పాలిట దేవుళ్లు'



జైపూర్: పేదప్రజల పాలిట ఆర్ఎంపీ వైద్యులు దేవుళ్లుగా మారుతున్నారని, పల్లెల్లో ప్రజలకు వైద్యం అందిస్తూ వారికి అన్నివేళలుగా సేవలందిస్తున్న ఆర్ఎంపీ వైద్యుల సేవలు మరువలేనివని నేతకాని మహర్‌హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టాల నాగరాజు తెలిపారు. నేతకాని సంఘం ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన ఆర్ఎంపీ వైద్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆర్ఎంపీ వైద్యులు, నేతకాని సంఘం నాయకులు నీలం రాజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బెల్లంపల్లి మండల అనుభవ వైద్యుల సంఘం(పీఎంపీ, ఆర్ఎంపీ)లు తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అనీష్, శివప్రతాప్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అనుభవ వైద్యుల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రవి, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు దశరథం, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి రాజేశం, సీనియర్ సభ్యులు లక్ష్మణాచారి, బ్రహ్మానందం, వెంకన్న, బిస్వాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.





బెల్లంపల్లి: కేక్ కట్ చేస్తున్న జీఎం దేవేందర్



చెన్నూర్: వైద్యులకు సన్మానం



లక్సెట్టిపేట: వైద్యులను సన్మానిస్తున్న సభ్యులు

మూడు రకాల మాత్రలతో బోదకాలు దూరం

- హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నేడు సమాజంలో నిక్షిప్తమై ఉన్న బోదకాలు వ్యాధిని ఐవర్‌మెక్టిన్, డీఈసీ, అల్‌బెండజోల్ అనే ఈ మూడు మాత్రలను సామూహికంగా మింగితే చాలు బోదకాలు దూరం చేయగలమని హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ స్పష్టంగా సూచించారు. హాజీపూర్ మండలం గుడిపేట మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలుర పాఠశాలలో శనివారం బోదకాలు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 10, 11, 12తేదీల్లో బూత్‌లలో, 13 నుంచి 19వ తేదీ వరకు ఇంటింటా బోదకాల నివారణకు మింగించే ఎండీఏ కార్యక్రమంలో 20, 21, 22తేదీల్లో మాప్అప్ ఉంటుందని అన్నారు. మైక్రో ఫైలేరియా క్యూలెక్స్ దోమకాటు వలన వ్యక్తి శరీరంలో బోదకాలు ప్రవేశిస్తుందని, ఈ వ్యాధి లక్షణాలు బయట పడటానికి 10నుంచి 15 సంవత్సరాలు పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎం.డీ.ఏ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామ్మూర్తి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయుడు సందీప్, హెచ్ఈఓ రఘుపతి, ఎంఎల్‌హెచ్‌పీ సాయిప్రసన్న, ఏఎన్ఎంలు లక్ష్మి, బేబీరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

'అర్హులకు దళితబంధు ఇవ్వాలి'



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: దళితబంధు పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ వర్తింప జేయాలని దళితహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు డీఆర్ శ్రీధర్, కార్యదర్శి దేవి పోచన్న డిమాండ్ చేశారు. బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఉన్న బాబాసాహెబ్ విగ్రహం ఎదుట శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. 2018ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. దళితుల సమస్యలను తీర్చడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. దళితబంధు పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న తహసీల్దార్లకు వినతిపత్రం అందజేయాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. భూ పంపిణీకి అసైన్డ్ ల్యాండ్ కమిటీని పున:రుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జంజర్ల రవిరాజ్, నాతరి రాజ్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'తాగునీటి అవస్థలు పట్టించుకోవడం లేదు'



ప్రచారంలో పాల్గొన్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: వర్షాకాలం వచ్చినా మంచిర్యాల మున్సిపాలిటీలోని ప్రజలకు తాగునీరు అందక అవస్థలు పడుతున్నారని, మున్సిపల్ చైర్మన్ నివాసం ఉండే పాతమంచిర్యాలలోనూ తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ విఫలం చెందుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల 8వ వార్డులో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం సందర్భంగా ఆ పార్టీ నాయకులు శనివారం వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందుల గురించి ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, మల్లేశ్, శ్రీదేవి, మల్లికార్జున్, సతీశ్, రాజు, రాకేశ్, అశోక్, రెన్వా పాల్గొన్నారు.

'రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది'

తాండూర్: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని ఆ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ విమర్శించారు. తాండూర్ మండలం కిష్టంపేట, రేచినీ, తాండూర్‌లలో శనివారం జరిగిన మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్గం తిరుపతి, నాయకులు సంతోష్, పవన్‌రెడ్డి, శేషగిరి, మహీధర్ గౌడ్, చిరంజీవి, విష్ణు కళ్యాణ్, భరత్, ప్రదీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల: మండలంలోని మైలారంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఠాకూర్ శైలేందర్‌సింగ్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ వెళ్లి బీజేపీ కరపత్రాలను అందజేశారు.

ధర్నా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

చెన్నూర్‌రూరల్: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలో గుడిసెల వద్ద శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రెండు నెలలుగా గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని, స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కె మోహన్, డీవైఎఫ్‌వై జిల్లా కార్యదర్శి అరిగెల మహేష్, వృత్తిదారుల సంఘం నాయకులు నగేష్, రేణుక, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మణి, నాయకులు భూదేవి, రవి, కరీమా తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన రామనామం



రామనామస్మరణ చేస్తున్న భక్తులు

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ భక్తులు శ్రీరామనామ స్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం శ్రీరామ నామజపం ప్రారంభించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి శ్రీరామ నామస్మరణం చేశారు. ఆదివారం ఉదయం 6గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. లోక కళ్యాణార్థం శ్రీరామ నామస్మరణ మహత్కార్యాన్ని చేపట్టినట్లు ఆలయ అర్చకులు ఫణి కుమార్ శర్మ తెలిపారు. శ్రీరామ నామస్మరణం అన్ని కష్టాలను తొలగిస్తుందని తెలిపారు. రామనామంకు మించిన మంత్రం లేదన్నారు. కార్యక్రమంలో హనుమాన్ సేవా సమితి సభ్యులు శ్రీనివాస్, భీమయ్య, మధుసూదన్ రెడ్డి, తిరుపతి, కృష్ణ, గంగాధర్, సది పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో క్షీరాభిషేకంలో..



లక్సెట్టిపేటలో క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మంచిర్యాలటౌన్/జైపూర్/లక్సెట్టిపేట: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించిన సీఎం కేసీఆర్ మంచిర్యాల జిల్లాలోని 311గ్రామ పంచాయతీలకు రూ.10లక్షల చొప్పున, 7మున్సిపాల్టీలకు రూ.25కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించడంపై ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కాసిపేటగనిపై మాట్లాడుతున్న నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేటగని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం గని మేనేజర్ అల్లా వుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గేటుమీటింగ్‌లో మాట్లాడుతూ గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గతంలో తెలిపినట్లు, పరిష్కారానికి నోచుకోనందునా జీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాసిపేట గనికి వచ్చే రోడ్డు సక్రమంగా లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. గనిలో సర్వీస్ అయిపోయిన ఎస్‌డీయల్ యంత్రాలు నడపటం ద్వారా కార్మికులకు ఇబ్బందులు కావడంతో పాటు సంస్థకు ఉత్పత్తి రావడం లేదని వెంటనే నూతన ఎస్‌డీయల్ యంత్రాలు ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సీడబ్ల్యూ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి, నాగేశ్వరరావు, పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మినారాయణ, నాయకులు రాజేందర్, రవీందర్, సంతోష్, కామెర రాములు తదితరులున్నారు.

'భద్రత మన బాధ్యతగా స్వీకరించాలి'



మాట్లాడుతున్న పీవో శ్రీనివాస్

జైపూర్: భద్రత.. మన బాధ్యతగా స్వీకరించడం మూలంగా ప్రమాదరహితంగా అందరం ముందుకు సాగుతామని ఐకే-1ఏ, ఐకే-ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఎం.శ్రీనివాస్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే-1ఏ, ఐకే-ఓసీపీపై శనివారం ప్రమాదాల నివారణ, సురక్షిత పని విధానాలు, పద్ధతుల అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యక్తిగత భద్రతను ఇంటి నుంచే ప్రారంభించి, ప్రతి ఒక్క ఉద్యోగి హెల్మెట్ ధరించాలన్నారు. పని ప్రాంతాల్లో రక్షణ సూత్రాలు పాటిస్తూ, రక్షణ పరికరాలను ఉపయోగిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్లు రవికుమార్, బ్రహ్మాజీరావు, నాగన్న, రక్షణాధికారులు ఆత్మారాం సహాని, సతీశ్, పిట్‌కార్యదర్శి గడ్డం మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో శనివారం ఓసీపీ మేనేజర్ రక్షణపై అవగాహన కల్పించారు. రక్షణ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎస్సార్పీ 3, 3ఏ గనిలో భద్రత అవగాహన డ్రైవ్‌ను నిర్వహించారు. గని మేనేజర్ సంతోష్ కుమార్ ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఆర్కే 6గనిలో గని మేనేజర్ తిరుపతి ఉద్యోగులకు రక్షణ నియమాలను వివరించి రక్షణతో ఎలా పని చేయాలో సూచించారు.

బొగ్గుబాయి వార్తలు

రిటైర్డ్ ఉద్యోగులకు వీడ్కోలు

శ్రీరాంపూర్: ఏరియాలోని ఆర్కే 5గనిలో రిటైర్డ్ అయిన అసిస్టెంట్ మేనేజర్ రామ్‌చందర్, హెడ్ ఓవర్‌మెన్‌లను రమేష్ రాజులను శనివారం గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్ శాలువాతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం వారికి కంపెనీ నుంచి చెల్లించే టర్మినల్ బెనిఫిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్, అసిస్టెంట్ మేనేజర్ రాందాస్, పిట్ ఇంజనీర్ రాధాకృష్ణ, పిట్ సెక్రెటరీలు మహేందర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరించిన జీఎం

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా కమ్యూనికేషన్ సెల్ కళాకారులు రూపొందించిన 'చదువు అంటే భయం వద్దు' సామాజిక గీతం సీడీని జీఎం సంజీవరెడ్డి ఆవిష్కరించారు.

'ఉద్యోగుల కృషి అభినందనీయం'

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి అధికారుల, ఉద్యోగుల సమష్టి కృషితోనే ఏరియాలో గత నెల 97శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని ఏరియా జీఎం మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఏరియాలోని కేకే-5, ఆర్కే, ఓసీ, కేకే-ఓసీ గనుల్లో నూరు శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. ఏరియాలో 3,71,000టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 3,58,108టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. కేకే-5గని పర్యావరణ ఉల్లంఘన, ప్రజాభిప్రాయ సేకరణ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారని, అది త్వరలోనే అనుకూలంగా రిపోర్ట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరియాలోని క్వార్టర్లను కబ్జా చేసినా, సింగరేణి స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టినా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్ పార్టీలోకి దుర్గం నరేష్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దుర్గం నరేష్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగే బహిరంగసభలో రాహుల్‌గాంధీ సమక్షంలో చేరనున్నట్లు తెలిసింది. నరేష్ గతంలో టీడీపీ, తెలంగాణ జన సమితి పార్టీల్లో పనిచేశారు. ఈ మధ్యనే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మహిళా నాయకురాలు బత్తుల సరిత కూడా కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధమైనట్లు సమాచారం.

రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ రిజిస్ట్రేషన్

వేమనపల్లి: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ రత్నం ప్రదీప్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్లు చేయించారు.

ఘనంగా చార్టెర్ డే వేడుకలు

బెల్లంపల్లి: బెల్లంపలి సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం చార్టర్ డే వేడుకలు జరిగాయి. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ కొడిపాక సాయినాథ్‌కు శాలువా కప్పి సన్మానం చేశారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి శివారులోని 306, 301సర్వే నంబర్‌లో భూమిని ఇటీవల నీల్వాయికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమణకు పాల్పడుతున్నారని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మధుకర్ వాట్సాప్ ద్వారా తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో శనివారం ఆక్రమణకు గురైన భూమి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

నోట్‌బుక్స్ అందజేత

దండేపల్లి: మండలంలోని ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంచిర్యాల మార్వాడి మంచ్ ఆధ్వర్యంలో రూ.40వేల విలువ చేసే నోట్‌పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలలో దండేపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

డీఎంహెచ్‌వో దిష్టిబొమ్మ దహనం

బెల్లంపల్లి: విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని భగత్‌సింగ్ చౌరస్తా వద్ద శనివారం డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు దిష్టిబొమ్మను దహనం చేశారు. డాక్టర్ నిర్లక్ష్య వైఖరితో మూడు నెలల శిశువు చనిపోయినా, డీఎంహెచ్‌వో చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని విమర్శించారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా సందీప్

మంచిర్యాలఅర్బన్: అఖిల భారత విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్‌గా మారం సందీప్ ఎన్నికయ్యారు.